17వ

# సూర్య

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,6 ఫిబ్రవరి 2024



## ఎ.పి.ఎన్.జి.జి.ఓ. మహిళా సంఘ అభ్యర్థుల ఎన్నిక





**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎ.పి.ఎన్.జి.జి.ఓ. సంఘం మహిళా విభాగం కార్యవర్గ సమావేశము సోమవారం ఎన్.జి.ఓ. హెూంలో జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహిళా విభాగం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా చైర్ పర్సన్‌గా బి.సుజాత, జిల్లా కన్వీనర్‌గా ఎ.దేవి, జిల్లా కో–చైర్ పర్సన్‌గా ఎస్.భారతి, జిల్లా వైస్ చైర్ పర్సన్లుగా పి.వి.ఎస్.కే. దుర్గ, ఎస్.దీపిక, జిల్లా సంయుక్త కన్వీనర్లుగా ఎమ్.సుధ, ఎస్.లత, కె.దివ్య, వై.కె.సింధూర, టి.దుర్గ, బి.ప్రసన్న మరియు క్యాషియర్‌గా దుర్గ, ఎక్స్ అఫీషియో మెంబర్లుగా సి.హెచ్.లావణ్య, పి.కుమారిలను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనవారికి అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ఎ.పి.ఎన్.జి.జి.ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామమోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకయాల వెంకటకృష్ణ, జిల్లా సహాఅధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరావు, జిల్లా ఉపాఅధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ళ చంద్రరావు, కె.వి.ఎన్.వి.ప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఎన్.వీరబాబు, కాకినాడ పట్టణ అధ్యక్షులు షేక్ అజీజ్, కార్యదర్శి ఎ.సత్తిరాజు, కరప యూనిట్ అధ్యక్షులు బి.ఆర్.వి.చౌదరి తదితరులు పాల్గొన్నారు.





# పదోన్నతులకు రంగం సిద్ధం

**– నేడో రేపో అధికారక ఉత్తర్వులు – సింగిల్ ఏసి పదోన్నతిపై ఇతర అధికారుల ఆగ్రహం**

**కాకినాడ,మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** దేవాదాయశాఖలో పదోన్నతుల జాతర జరుగుతోంది. ముగ్గురు జాయింట్ జాయింట్ కమిషనర్లు, 26 మంది డిప్యూటీ కమిషనర్లు, 24 మంది అసిస్టెంట్ కమిషనర్లకు పదోన్నతులు రానున్నాయి. ఇందుకు సంబంధించి ఆర్డర్లు సిద్ధం చేశారు. మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కమిషనర్ సంతకం పెట్టడం తరువాయి. కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న ఆర్.వి. చందన, పులి నారాయణమూర్తి, నాగమల్లేశ్వరరావు తదితరులు పదోన్నతుల జాబితాలోఉన్నారు.అదేవిధంగా కాకినాడడిప్యూటీకమిషనర్ మేడేపల్లి విజయరాజు జాయింట్ కమిషనర్ పదోన్నతిలో ఉన్నారు. ఇక డిప్యూటీ కమిషనర్‌గా రాజమండ్రిలో పనిచేస్తున్న సింగం రాధ మొదటి జాబితాలోనే ఉన్నారు.

మంగళవారంసాయంత్రానికి లేదాబుధవారం ఉదయం ఈఆర్డర్లు వస్తాయని వారంతా ఎదురు చూస్తున్నారు.అయితే ఈ పదోన్న తుల కంటే ముందు కృష్ణా జిల్లా మోపిదేవిలో ఇన్చార్జి ఈవోగా పనిచేస్తున్న చక్రధర్‌రావుకు అసిస్టెంట్ కమిషనర్ పదోన్నతి ఇచ్చేశారు. ఆర్డర్ కూడా వచ్చేసింది. పదోన్నతుల జాబితా సిద్ధమయ్యాక అందరిని పక్కనపెట్టి ఆ ఒక్కరికే ప్రమోషన్ ఎలా ఇచ్చారు అంటూ మిగిలినఅధికారులు ప్రశ్నిస్తున్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ ఆశీస్సులతో ఆయనకి పదవి దక్కిందని చెబుతున్నారు. మిగిలినవారికీ ఆర్డర్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో వారు కోర్టుకు వెళ్లే ప్రతిపాదన విరమించుకున్నట్లు సమాచారం. మొత్తంమీద కాకినాడ, బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలలో పదోన్నతుల కోసం ఈవోలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

గ్రేడ్ వన్ ఈవోలకుఅసిస్టెంట్ కమిషనర్లుగా,అసిస్టెంట్ కమిషనర్లకు డిప్యూటీ కమిష నర్‌లుగా,డిప్యూటీ కమిషనర్లకుజాయింట్ కమిషనర్లుగా పదోన్నతులు రానున్నాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖ నుంచి వచ్చినవారిని వెనక్కి పంపి పదోన్నతులు పొందినవారికి ఆ పోస్టులు ఇచ్చే విధంగా ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ రాము సత్యనారాయణలతో దేవాదాయశాఖ అధికారులు మంతనాలు జరుపుతున్నారు. ఇవి ఫలిస్తాయా లేదా అన్నది వేచి చూడాలి.

## కాంట్రాక్టర్లు మా పొట్టలు కొట్టొద్దు

**– నినదించిన జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ – 5వ రోజు కొనసాగిన ఆందోళన**
**– అధికారులు జోక్యం చేసుకోవాలని సిఐటియు డిమాండ్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన 5వ రోజైన సోమవారం కూడా కొనసాగించారు.ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు జనార్దన్, భాగ్యలక్ష్మి లు మాట్లాడుతూ తాము గత 20 సంవత్సరాలు జిజిహెచ్ లో కీలక విభాగమైన శానిటేషన్‌లో పని చేస్తున్నామన్నారు. పోషిస్తుందన్నారు. యజమానులు చెల్లించవలసిన పిఎఫ్ వాటా కూడా కార్మికుల జీతాల నుండే కత్తిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై చాలాసార్లు అధికారులకు, కాంట్రాక్టు సంస్థ వారికి విన్నవించామన్నారు. న్యాయం జరగక పోవడం వల్లనే ఆందోళన చేపట్టామన్నారు.

ఈ వారంలో స్పందన లేకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామన్నారు.యూనియన్ అధ్యక్షుడు సిహెచ్. విజయ్ కుమార్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఐక్యంగా పోరాటం సాగిద్దామన్నారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం కొరకు అధికారులు జోక్యం చేసుకోవాలని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, జె.లక్ష్మీప్రియ, ఆర్.రమేష్, జె.శేషు, ఎస్.వాసు, బి.మంగతాయారు, చంద్రకళ, పుష్ప, కుమారి, అరుణ, తలుపులమ్మ, వెంకటలక్ష్మి, మంగ, బి.శ్రీకాంత్, ఎం.రవి, మూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆసుపత్రి మాతాశిశు విభాగం వద్ద నుండి ప్రదర్శన ప్రారంభించి, ఓపి విభాగం వద్ద ముగించారు.

## ట్రాఫిక్ అధికారుల తనిఖీలు





**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ ట్రాఫిక్ వన్ సిఐ నూని రమేష్ ఆధ్వర్యంలో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సైలెన్సర్లు ద్విచక్ర వాహనాలకు ఎలా ఉన్నాయో అలా ఉంచకుండా మార్పు చేసి శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న 21 మందిని గుర్తించారు. వాహనాలు సీజ్ చేశారు. అదేవిధంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న మరో 27 మందిని గుర్తించారు. అవి కూడా సీజ్ చేశారు. మొత్తం 48 వాహనాలను కాకినాడ ట్రాఫిక్ పార్క్‌కు తరలించారు. ఆ వాహనాలు నడిపేవారిని అక్కడికి తీసుకువచ్చారు. వారికి క్లాస్ తీసుకున్నారు. సిఐ రమేష్ తోపాటు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ హరినాథ్ రెడ్డి ట్రాఫిక్ భద్రత గురించి వారికి వివరించారు. ట్రాఫిక్ భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమ వారం ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు సిఐ రమేష్ తెలి పారు. సైలెన్సర్లు మార్చి శబ్దాలు కలిగించడం వల్ల ఎందరో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలి అన్నారు. జరిమానా విధించడంతోపాటు వెంటనే సైలెన్సర్లు యధా విధిగా ఉండేలా ఏర్పాటు చేశారు.అదేవిధంగా సెల్ ఫోన్ మాట్లా డుతూప్రమాదాలకు గురవుతున్నారు, ప్రాణాలు పోతున్నాయి, కుటుంబసభ్యులు అనాధలవుతున్నారుఅంటూవీడియోలు ప్రదర్శిం చారు. ఖచ్చితంగా ఇక నుంచి ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాల్సి ఉంటుందని సిఐ రమేష్, ఎంవిఐ హరినాథ్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి




**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** భూహక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ప్రజల ఆస్తి హక్కులను హరించే భూహక్కు చట్టాన్ని నిలిపివేయాలని న్యాయవాదులు నినాదాలు చేశారు. దీనికి సంబంధించిన జి.ఓ. 512 ని రద్దు చేయాలని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆర్.ఒ.ఆర్. చట్టాన్ని సవరణ చేస్తే సరిపోతుందని, కొత్త చట్టం అవసరం లేదన్నారు. చట్టాన్ని రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీమోహన్, వెంకటరమణ, వాడ్రేవు సాయి ప్రసాద్, ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, జూనియర్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృధ్వీ, సీనియర్ న్యాయవాదులు డి.పి.శాస్త్రి, బి.సూర్యనారాయణ, ఆర్.వి.జి. సుబ్బారావు, బినయ్ బాబు, ఐ.గంగాధర్, కె.వి.వి.సత్య నారాయణ తదితర సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## 'భోజన' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**– సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సోమవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. తొలుత రంపచోడవరం సీఐటీయూ జిల్లా కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా గౌరవ అధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా నేటికి అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా ప్రభుత్వం ఎక్కడికక్కడ మధ్యాహ్నం భోజనం కార్మికులను నిర్బంధించి భయభ్రాంతులకు గురిచేస్తుందని అన్నారు. వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కొరకు మధ్యాహ్నం భోజనం కార్మికులందరు ఐక్యంగా, సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు సరైన సమయానికి వేతనాలు, పెట్టుబడులు పెట్టిన బిల్లులు రాకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు. ప్రతి నెల 5వ తారీఖు లోపు వేతనాలు బిల్లులు ఇవ్వాలని, గ్యాసు ప్రభుత్వమే సరపరా చేయాలని, 12 నెలలకు వేతనం ఇవ్వాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెను చార్జీలు 20 రూపాయలు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైనటువంటి వారికి నష్టపరిహారం చెల్లించాలని, స్కూల్లో ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఈ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, మౌలిక సదుపాయాలు అయిన మంచినీరు, వంట షెడ్డు, గ్యాస్ స్టవ్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, సంవత్సరానికి రెండు జతలు యూనిఫాం ఇవ్వాలని, రెండు నెలలకు ఒకసారి వర్కర్లతో మండల విద్యాశాఖ అధికారులతో సమావేశాలు పెట్టాలన్నారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినత పత్రాన్ని రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ కు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు ఎమ్.బాపనమ్మ, రాధమ్మ, అమ్మాజీ, తుర్రం కుమారి, సొల్లామ్, పద్మ, కళింకోట, మంగమ్మ పాల్గొన్నారు.

## ఐదవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అల్లవరం, మేజర్‌న్యూస్ :** 2024–25 విద్య సంవత్సరంలో గోడి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలలో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గోడి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నక్క శ్రీనివాస్ తెలియజేశారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి ఫిబ్రవరి 23వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో http:///apbragcet. Apcfss సైట్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి మార్చి 10న ప్రవేశపరీక్ష ఉంటుంది. 2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుకున్నవారు 5వ తరగతికి, అదేవిధంగా10 వ తరగతి పరీక్షకు హాజరయ్యేవారు ఇంటర్లో చేరడానికి అర్హులని తెలిపారు. 5వ తరగతి 80,ఇంటర్ ఎంపీసీ40, బైపిసి40 చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలియజేశారు.

## ఆరోగ్య సేవలకు అధిక ప్రాధాన్యత - డా. గొడవర్తి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రోగులకు సకాలంలో ఆరోగ్యసేవలు అందించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఇనోదయ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. గొడవర్తి రామ్మోహన్ అన్నారు. నాగమల్లితోట జంక్షన్‌లోని ఇనోదయ హాస్పిటల్ ఆరవ వార్షికోత్సవ సందర్భంగా మెగా మెడికల్ క్యాంప్‌ను సోమవారం ఉదయం హాస్పిటల్ ప్రాంగణంలో డా. గొడవర్తి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత అయిదు సంవత్సరాలుగా ప్రజలకు సకాలంలో ఆధునిక వైద్యవిజ్ఞాన సేవలను అందిస్తూ వారి కుటుంబాలలో వెలుగులు నింపుతున్నామని చెప్పారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చిన వైద్యపథకాలను ప్రజలకు ఉచితంగా అందిస్తూ వారి కుటుంబాలకు అండగా నిలబడ్డామని వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన ఆరోగ్యవైద్య శిబిరాలను నిర్వహించడమేకాక పలు రోగాల పట్ల అవగాహన కల్పిస్తూ తీసుకోవల్సిన జాగ్రత్తలను కూడా ఎప్పటికప్పుడు వివరిస్తున్నామని, అందుకు ప్రత్యేక మెడికల్ టీమ్‌ను కూడా ఏర్పాటు చేసామన్నారు. వైద్యరంగంలో నిష్ణాతులైన వైద్యులను నియమించడం ద్వారా రోగులకు సకాలంలో వైద్యసేవలను అందించడంతో పాటు వారి యోగక్షేమాలను ఎప్పటికప్పుడు పరిశీలించడం జరుగుతోందన్నారు. ఇనోదయ హాస్పిటల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లావణ్య మాట్లాడుతూ ఇప్పటి వరకు 50వేల మంది రోగులకు వైద్యసేవలు అందించడమే కాక, ఏడువేల శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. 15వేల మందికి ఇనోదయ హాస్పిటల్‌లో పలు వైద్యసేవలను అందించామన్నారు. రోగులకు ఉత్తమ వైద్యసేవలను అందించడానికి అవసరమైన ఆధునిక వైద్యపరికరాలతో పాటు నిష్ణాతులైన వైద్యులను అందుబాటులోకి తీసుకొచ్చామని, దీనివల్ల రోగుల బంధువులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నదే తమ అభిమతమన్నారు. తమ సిబ్బంది ఎల్లప్పుడూ విధి నిర్వహణలో అప్రమత్తమై ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు.కార్యక్రమంలో వైద్యులు డా.దేవి, డా.ఎం.గౌతమకృష్ణ, డా. పి.మదన్, డా. పి.సాయికృష్ణ, డా.ఎం.వి.రమణమూర్తి, డా.టి.రవితేజ, డా.జి.శ్రీనుబాబు, డా.సి.సరస్వతి, డా.నాగభూషణం, డా.డి.ఎన్.ఎస్.ప్రకాష్, డా. కె.సత్యసౌజన్య, జనరల్ మేనేజర్ శుభనీష్‌తో పాటు హాస్పిటల్ సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు.


## నలుగురికి కారుణ్య నియామకం

**– ఉద్యోగ పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ డా కృతికా శుక్లా**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా.. జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి నాలుగురు అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పిస్తూ కారుణ్య నియామక పత్రాలు అందించారు. ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వర్తిస్తూ వివిధ కారణాల వలన మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు సాంఘిక భద్రత కల్పిస్తూ కారుణ్య నియామకం కింద ఇద్దరికి జూనియర్ సహాయకులుగాను, ఒకరికి వీఆర్వో, మరొకరికి ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగాలు కల్పించామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి రెవెన్యూ అధికారి కె.శ్రీరమణి, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ కార్యక్రమంపై గోడపత్రిక, కరపత్రాలు ఆవిష్కరణ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కలెక్టర్ కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఈ నెల 9వ తేదీన జరుగు జాతీయ నులిపుగుగల నివారణా కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలు మరియు కరపత్రాలను జిల్లా కలెక్టర్ డా. కృత్తిక శుక్లా, జాయింట్ కలెక్టర్ పి.వి. ప్రవీణ్ ఆదిత్య ఆవిష్కరణ చేసినారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలో వున్న ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అంగన్వాడీ సెంటర్లు, స్కూల్స్ మరియు కళాశాలలో గోడపత్రికలు ప్రదర్శించి అవగాహన కల్పించడంతో పాటు జిల్లాలో ప్రజలందరూ వారి 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాలు వయస్సుగల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా రక్తహీనత నుండి కాపాడు కోవచ్చునని, సమీప అంగన్వాడీ కేంద్రాలలో, అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్, నర్సింగ్, మొదటి సంవత్సరం చదువుతున్న డిగ్రీ, ఇంజనీరింగ్ మరియు మెడికల్ కళాశాలల విధ్యార్థిని విధ్యార్థులకు మరియు పాఠశాలకు వెళ్లని పిల్లలకు కూడా నులిపురుగుల మాత్రలను ఉచితంగా ఇవ్వబడుననని తెలియచేశారు. 1–2 సంవత్సరములు గల పిల్లలకు సగం మాత్ర మరియు 2–19 సంవత్సరముల గల పిల్లలకు ఒక మాత్రను వేసుకోవాలని సూచించారు. 1–5 సంవత్సరములు గల పిల్లలకు మాత్రను నీటిలో పొడిచేసి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్‌సిడి & ఆర్‌బిఎస్‌కే డా. వి.అరుణ, డి.ఐ.ఒ మరియు సిబ్బంది పాల్గొన్నారని జిల్లా వైద్య శాఖాధికారి డా. ఆర్.రమేశ్ తెలిపినారు.

## తహసీల్దార్‌ను కలిసిన పి.గన్నవరం ప్రెస్ క్లబ్ సభ్యులు



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం పి.గన్నవరం మండలం నూతన తహసీల్దార్ హుస్సేన్‌ని పి.గన్నవరం ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎలక్షన్ బదిలీల కారణంగా భీమవరం నియోజకవర్గం పాలకోడేరు మండలం నుండి కోనసీమ జిల్లా పి గన్నవరం మండలం తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టారు. జర్నలిస్ట్‌లకు నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. అలాగే ఎవరు ఫోన్ చేసిన వెంటనే స్పందిస్తాను. రెవిన్యూ పరిదిలో గల ఎ సమస్య అయినా ప్రజలు నేరుగా నన్ను కలువ గలరని తెలిపారు.

## పిఠాపురం తహసీల్దార్‌గా కాలి లక్ష్మి



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మండల తహసీల్దార్‌గా కాలి లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన పి. త్రినాధరావు ఎన్నికల సాధారణ బదిలీలలో భాగంగా ఏలూరు బదిలీపై వెళ్లారు. ఇప్పటివరకు

విజయవాడ వెస్ట్ తహసీల్దార్‌గా పనిచేసిన కాలి లక్ష్మి సాధారణ బదిలీలలో బాగంగా పిఠాపురం బదిలీలపై వచ్చారు. ఈ మేరకు ఆమె సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తన ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ ను పలువురు కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపినవారిలో... రెవెన్యూ అధికారి వెంకటేశ్వరావు మరియు కార్యాలయ సిబ్బంది, మాల మహానాడు అధ్యక్షులు బి.ఎన్ రాజు తదితరులు ఉన్నారు.

# బిజెపి,దాని అనుబంధ పార్టీలకు ఓటు తిరస్కరించండి



**– ఈపీఎఫ్ పెన్షనర్లకు ఏపీఆర్పీఏ పిలుపు**

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** దేశంలో 75 లక్షలకు పైగా ఉన్న ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్ సమస్యలు పరిష్కరించనందుకు కేంద్రంలో బిజెపి దాని అనుబంధ పార్టీలకు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేయకుండా తిరస్కరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్షనర్లకు పిలుపునిచ్చారు. సోమవారం ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎఫ్ పెన్షన్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ బోటుక్లబ్ వద్ద ఈపీఎఫ్ ఆఫీస్‌కి ఎదురుగా రిలే నిరాహార దీక్షలు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కే.రమణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.బాబురావు, బి.వీరభద్రరావు, వై.రామదాసు, వి.నూకరాజు, పి.మోహన్ మురళి, ఏ.సత్యరాజు, యూ.సూర్య నారాయణ, డి.శ్రీనివాసు, బి.జార్జి భర్న్ బసు, ఇ.పెంటారావు, కే.సువర్ణరాజు, వై.రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ దేశంలో 186 రకాల పరిశ్రమల్లో ఉత్పత్తి మరియు సేవా రంగాలలో పబ్లిక్ కోఆపరేటివ్ మరియు ప్రైవేటు రంగానికి చెందిన 75 లక్షల మంది ఈపీఎఫ్ పెన్షనర్లు తమ హక్కుల కోసం దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్నారన్నారని ఇందులో 35 లక్షల మందికి కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు కూడా చెల్లింపబడుట లేదని తెలియజేశారు. వీరందరికీ కనీస పెన్షన్ 9,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ ఈపీఎఫ్ కార్యాలయం ఎదురుగా బోట్ క్లబ్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ నిరాహార దీక్షలు ఫిబ్రవరి 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించకపోతే రాబోయే పార్లమెంటులో ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి ఓట్లు వేయకుండా తిరస్కరించాలని పెన్షనర్లు అందరిని సత్తిరాజు విజ్ఞప్తి చేశారు. ధర్నా శిబిరానికి కాకినాడ రూరల్ సిఐటియు నాయకులు మేడిశెట్టి వెంకటరమణ మద్దతుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జోగ అప్పారావు, ఈఎస్ఎన్ రెడ్డి, రామకృష్ణ మొదలైనవారు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన భాజపా శ్రేణులు..



**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్ :** ఏలేశ్వరం నగర పంచాయితీ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు రెడ్డి లోవరాజు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు కమిషనర్ శివకుమార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భముగా జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టిం వెంకట రమణలు సోమవారం కలిసి నగరంలో అపరిస్కృతంగా ఉన్న సమస్యలను కమిషనర్ దృష్టి కి తీసుకు వెళ్ళడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాతికింది కృష్ణారావు , రాము శ్రీను, యస్ సి మోర్చా టౌన్ కన్వీనర్ థామస్ తదితరులు పాల్గొన్నారు.

## గోమతకు “ఉయాలోత్సవం”



**పెరవలి, మేజర్ న్యూస్ :** మాతృదేవత తర్వాత విశిష్టమైన ద్వితీయ స్థానము గోమాతకు ఉంది. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామలలో ఫిబ్రవరి 5వ తేదీ సోమవారం అఖండం వెంకటేశ్వరరావు ఇంటిలో చంటి పిల్లలకు 21వ రోజు చేసే ఉయ్యాల వేడుకలాగా వారి ఇంట గోమాతకు పుట్టిన దూడకు ఉయ్యాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు మరి ఇంత పుట్టిన గోమాత దుడను ఈరోజు ఉయ్యాలో వేసి హారతులు పూజలు,కొత్త వస్త్రాలు ఇచ్చి కుటుంబలో జరిగే వేడుకగా చేశారు.

## తెల్లకొండ గిరిజనులకు సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బట్టలు, నిత్యవసర వస్తువులు పంపిణీ



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని కొండపల్లి పంచాయతీ తెల్ల కొండ గ్రామంలో 70 మంది గిరిజనులకు బట్టలు, నిత్యవ సర వస్తువులు, బియ్యం సోమవారం సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి గన్నవరం మండలం పి గన్నవరం కి చెందిన సహృదయ ఫౌండేషన్ ఫౌండర్ పైడి రాజేష్ ఆర్థిక సహాయంతో ప్రాజెక్ట్ భరోసా- 2024 అనే కార్యక్రమం ద్వారా నిత్యవసర సరుకులతో పాటు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఫౌండర్ రాజేష్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు అండగా మా ఫౌండేషన్ ఉంటుందని ఏజెన్సీలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సహృదయ ఫౌండేషన్ సభ్యులు కొండ్రు సీతా రత్నం,పండు శ్రీకాంత్,లేజర్ జయపాల్,ఆనంద పాల్, గ్రామానికి చెందిన గిరిజనులు ఉన్నారు.


## నూతన తహశీల్ధార్ పలకరింపుల వెల్లువ...



వి.ఆర్.పురం,మేజర్‌న్యూస్: అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం,వరరామ చంద్రాపురం మండలంలో ఈరోజు సోమవారం,వరరామచంద్రాపురం మండలకేంద్రంలో కొత్తగా బాధ్యతలు తీసుకున్న తహాశీల్ధార్ సయ్యద్ మౌలానా ఫాజిల్‌ను మండలం తెలుగుదేశం పార్టీ మండల కమిటీ బృందం మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.

కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆచంట శ్రీనివాసరావు, కార్యదర్శి బురక కన్నారావు, జడ్పి.టి.సి. వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పి.టి.సి. ముత్యాల రామారావు, ఎం.పీ.టీ.సీ. వాళ్ల వెంకటేశ్వర రెడ్డి, ట్రెజరీ పెందుర్తి సుదర్శన్ రావు, నియోజకవర్గం వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాష్ రావు, ఐ.టీ.డీ.పీ. కన్వీనర్ ముత్యాల సిద్దు, మాజీ మండల అధ్యక్షులు గొంది చంద్రయ్య,మాజీ సొసైటీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రాజవొమ్మంగి తహసీల్దారుగా డి.వి.సత్యనారాయణ



రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ : రాజవొమ్మంగి తహసీల్దారుగా డివి సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కామవరపు కోట నుండి సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన వైవి సుబ్రహ్మణ్యం ఆచారి తూర్పుగోదావరి జిల్లా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసిల్దార్ సత్యనారాయణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలానికి చెందిన రెవిన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నిరంతరం ప్రజలకు అందు బాటులో ఉండడం జరుగుతుందన్నారు. వివిధ పార్టీల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు రానున్నసార్వత్రిక ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వర్తించేందుకు సహకరించాలని ఆయన కోరారు. డిప్యూటీ తాసిల్దార్ అల్లి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్, రెవిన్యూ సిబ్బంది, వీఆర్వోలు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

# జాతీయస్థాయి 11వ స్థానంలో పిఠాపురం ఎల్.ఐ.సి శాఖ



**–ఆల్ ఇండియాలో మొదటి స్థానం సాధిస్తాం**
**–పిఠాపురం బ్రాంచి మేనేజర్ రాము చౌహాన్**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్ఐసి బ్రాంచ్ పిఠాపురం శాఖ జాతీయ స్థాయిలో 11వ స్థానంలో నిలిచిందని, ఆల్ ఇండియాలో మొదటి స్థానం సాధించేందుకు పిఠాపురం శాఖ పరుగులు తీస్తుందని పిఠాపురం శాఖ మేనేజర్ రాము చౌహాన్ అన్నారు. స్థానిక ఎల్.ఐ.సి కార్యాలయంలో నిర్వహించిన బడ్జెట్ కి సవాల్ ఏజెంట్స్ సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అనిల్ కుమార్, రాజమండ్రి డివిజన్ కౌన్సిల్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షులు రావుల మాధవరావు లను ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేసే విధంగా బడ్జెట్ కి సవాల్ ప్రతిజ్ఞ ను ప్రతి ఏజెంట్లతో చేయించారు. త్వరలో బ్రాంచ్ ఆల్ ఇండియాలో మొదటి స్థానం సాధించేందుకు ఉరకలు వేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్ అన్నారు. పిఠాపురం బ్రాంచ్ పరిధిలో ఎల్ఐసి పాలసీదారులు సహకారంతో బ్రాంచ్ మొదటి స్థానంలో జాతీయస్థాయిలో పతాకం ఎగురవేసేందుకు ప్రతి ఒక్క ఏజెంటు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దీపోత్సవ కార్యక్రమాన్ని దీపాలు వెలిగించి, సంకల్ప సప్తహ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు కర్నిడి ఏడుకొండలు, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్ ప్రవలిక ,ఏజెంట్స్ సభ్యులు కార్యాలయ సిబ్బంది, డెవలప్మెంట్, క్లాస్ వన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలు వద్దు - సైన్స్ ముద్దు

**– జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి కళాజాతలో వక్తలు**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** మూఢనమ్మకాలు వద్దు – సైన్స్ ముద్దు అని, ప్రజల్లో శాస్త్రీయ దృక్పదం పెంపు కోసమే జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కళ యాత్ర నిర్వహిస్తున్నామని జెవివి నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఆర్ఆర్ బి హెచ్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జెవివి రాష్ట్ర స్థాయి సైన్స్ కళ యాత్ర చేరుకుంది. మూఢన మ్మకాలకు వ్యతిరేకంగా కళాకారులు పలు కళారూపాలను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా కళాజాత కన్వీనర్ కన్నబాబు, కళాజాత మేనేజర్ మురళిలు మాట్లాడుతూ... మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలకు శాస్త్రీయ దృక్పథానికి చేరువ చేయాలనే ఉద్దేశంతో కళాజాత కొనసాగుతుందన్నారు. ఈ కళాజాతాలో నుత్యరూపకాలు, నాటికలు, గీతాలాపన, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలతో అవగాహన కల్పిస్తామన్నారు.ముఖ్యంగా విద్యార్థులు, యువత మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పదం అలవారుచుకోవలన్నారు.ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు వి సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ వి కేశవరావు, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ ఎన్ సూర్యనారాయణ, విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్సీపై వాయిదా తీర్మాణం ప్రవేశ పెడతాం



**– ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు**

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇచ్చిన డిఎస్సీ నోటిఫికెషన్ పై తాము వాయిదా తీర్మానం పెడతామని ప్రోగ్రెస్సివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు తెలిపారు. సామర్లకోట నవభారత్ వెంచర్స్ అతిధి గృహంలో గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సివిల్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏడాదికి ఒకసారి ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉండగా గత 6 సంవత్సరాలుగా అది జరగక పోయినా ప్రస్తుత ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడిన కారణంగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అయితే రాష్ట్రంలో 50 వేల పోస్టులు ఖాళీలు ఉండగా కేవలం 6 వందల పోస్టులకు మాత్రమే నోరిటికేషన్ విడుదల చెయ్యడం విచారకరం అన్నారు. ప్రతి ఏటా ఎంతమంది విద్యార్డులు చేరుతున్నారు, ఎంతమంది ఉపాధ్యాయులు అవసరం అన్న విషయంపై ద్రుష్టి పెట్టడం లేదన్నారు. దీనిపై త్వరలో జరగనున్న శాసన మండలి సమావేశంలో డిఎస్సీ వాయిదా తీర్మాణం చేయునున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

**–ప్రణాళికా బద్ధంగా సిద్ధపడాలి :** సివిల్స్‌కు సిద్దపడుతున్న యువత యాదాలాపంగా గాక ప్రణాళిక బద్ధంగా, సిలబస్ పై పట్టు సాధించే విధంగా సిద్దపడాలని పలు కోచింగ్ సెంటర్ ల అధ్యాపకులు సూచించారు. వందలాది మంది యువత పాల్గొన్న సదస్సులో వారు మాయలాడుతూ ప్రధానంగా అధిక సమయం వెచ్చించి పాత ప్రశ్న పత్రాలు, తెలుగు అక్కడమి పుస్తకాలు సేకరించి వాటితో నోట్స్ తయారు చేసుకుని సిద్దపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక మెటీరియల్ ను అందజేశారు. ఈ కార్యక్రమం లో చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, పలు కోచింగ్ సెంటర్ల అధ్యాపకులు, అధిక సంఖ్యలో సివిల్స్ కు సిద్దపడుతున్న యువత పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలిగిస్తే సాహించేది లేదు -అధికార్లు నిలదీత




**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రానున్న మహా శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా సాహించేది లేదని జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, భక్త నాయకులు వాడపర్తి వీర భద్రరావు తదితరులు హెచ్చరించారు. పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర అలయంలో మార్చి 6నుంచి 11వ తేదీ వరకూ జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం సాయంత్రం భక్తులు, గ్రామ నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు అప్పలకొండ, నాయకులు వీర భద్రరావు తదితరులు మాట్లాడుతూ ప్రధానంగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే కోనేరులో సుబ్రమైన నీరు నింపే విషయంలో ఆలయ అధికారులను ప్రశ్నించారు.

దానికి ఆలయ అధికారి డి నాగ మల్లేశ్వర రావు మాట్లాడుతూ కోనేరులోపూడిక తొలగించి కొత్తగా నీరు పెట్టేందుకు ఇప్పటికే చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. కాగాదానికి నాయకులుఆట్లాడుతూ వాస్తవానికి కోనేరులో పది అడుగులు పూడిక తీయించి నాలుగు అడుగులు గోదావరి ఇసుకను కోనేరు అంతా నింపి ఆపై సుబ్రమైన జలాలు నింపాల్సి ఉందన్నారు. అలా కాకుండా దేవాదాయ శాఖ సిపి సొంతంగా పనులను చేయించడాన్ని వారు తప్పు పట్టారు. పనులు ఏ విధంగా చేస్తున్నారో వివరాలు తెలపాలన్నారు. ఇంకా మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల ఏర్పాట్ల విషయంలో ఉలాంటి లోపాలు ఎదురైనా ఊరుకునేది లేదని అధ్యక్షులు అప్పలకొండ హెచ్చరించారు. కాగా ఏర్పాట్ల విషయం లో ఇంకా మాజీ కౌన్సిలర్ నేతల హరిబాబు, నాయకులు బిక్కిన సాయి, కౌన్సిలర్ సేపేని సురేష్, తదితరులు అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే అధికారుల సమావేశం నాటికి ఉత్సవాలపై సమగ్ర నివేదికతో సిద్ధం కావాలని నాయకులు, భక్తులు తెలిపారు.ఈ సమావేశంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, పట్టణ పరిధి లోని నాయకులు, భక్త నాయకులు పాల్గొన్నారు.

## పెరవలి నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన హిమ మహేశ్వరీ



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం నూతన ఎంపీడీవోగా కె.హేమ మహేశ్వరి ఫిబ్రవరి 5వ తేదీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇంతకుముందు అనపర్తి ఎంపీడీఓగా పనిచేస్తు బదిలీపై పెరవలి మండలానికి విచ్చేశారు . ఆమెకు ఎంపీడీవో ఆఫీస్ సూపర్నెంట్ రమేష్ ఇఓఆర్డి సిహెచ్ వెంకటరమణ సీనియర్ అసిస్టెంట్ అరిగెల వేణుగోపాలరావు జూనియర్ అసిస్టెంట్ కోన వెంకట్ వేణు సాయి శ్రీనివాసు తాయారు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఇతర సిబ్బంది పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.

## అన్నవరప్పాడు వెంకన్న ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయమునకు రెండు సంవత్సరముల కాలపరిమితిగాను నూతన ధర్మకర్తల మండల నియామకం కొరకు శ్రీయుత ఉప కమిషనర్ దేవాదాయ శాఖ కాకినాడ వారు నోటిఫికేషన్ జారీ చేశారని ఆలయ కార్య నిర్వహణ అధికారి మీసాల రాధాకృష్ణ తెలియజేశారు.

కావున ఆసక్తిగల అభ్యర్థులు 20 రోజులలోపుగా దరఖాస్తు చేసుకొనవలసినదిగా కోరారు. ఇతర వివరములకు వెంకటేశ్వర స్వామి వారి ఆలయ కార్యాలయం పనిచేయు వేళలలో సంప్రదించవలసిందిగా కోరారు.

## రాజవొమ్మంగి ఎంపీడీవోగా యాదగిరి ఈశ్వరరావు



రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ : రాజవొమ్మంగి ఎంపీడీవోగా లోకుల యాదగిరి ఈశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. యాదగిరి ఈశ్వరరావు గతంలో ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ వై రామవరం డిప్యుటేషన్పై వెళ్లారు. ఎన్నికల నియమావళి( రూల్స్) ప్రకారండిప్యూటేషన్ ఆర్డర్ రద్దు కావడంతో మరల ఇక్కడ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని యాదగిరి శ్వరరావు అన్నారు.

ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఎం వి రంగారావు అడ్డతీగల బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## పిసి, పి & డిటి చట్టం పటిష్ఠ అమలుకు చర్యలు



– ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ జె.సీతారామారావు అధ్యక్షతన డిప్యూటీ డిఎం & హెచ్ఓ డా.పి.సరిత ఆధ్వర్యంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసి, పి & డిటి) పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ తెలుపుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994 అమలుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డివిజన్ పరిధిలోని చట్టం అమలు తీరు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు, తదితర సంబంధించిన వివరాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు అడ్వకేట్ కందుల వెంకటరమణ, సత్యరవికుమార్, ప్రభుత్వ వైద్యులు డా.సత్యవేణి (గైనకాలజిస్ట్), డా.ఎల్.అనూషరాయ్, డా.పి.సత్యవంశి, డా.జి.మాధురి, ఎన్‌జిఓ సభ్యులు పల్ల వాసవి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఐ.ఆర్.టి అధ్యక్షులుగా దుర్గాప్రసాద్ రెడ్డి



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా ఐఆర్‌టి జిల్లా అధ్యక్షులుగా బి.దుర్గాప్రసాద్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా (మహిళా విభాగం) వై.వెంకటలక్ష్మి, పురుషుల విభాగం ఉపాధ్యక్షులుగా జి.నారాయణరావు, మహిళా ప్రెసిడెంటుగా సిహెచ్.వాణి పద్మజ, జనరల్ సెక్రటరీగా బి.నాగార్జున, జాయింట్ సెక్రటరీగా సిహెచ్.లోవరాజు, కోశాధికారిగా ఎస్.లోవ, సహ కోశాధికారిగా జి.ప్రసన్న కుమారి, సభ్యులుగా ఎస్.నాగేశ్వరరావు, ఆర్.నారాయణరావు, ఎం.రాజేష్‌బాబు, జె.కుమార్ రాజా, ఎం.ఆశీర్వాదం, వి.జ్యోతి, తదితరులు ఎన్నికైనట్లు అధ్యక్షులు దుర్గాప్రసాద్‌రెడ్డి తెలిపారు. పలువురు ఈ నూతన కమిటిని అభినందించారు.

# 9న డీ వార్మింగ్ డే విజయవంతం చేయాలి

**-నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు కార్యాచరణతో అమలు చేయాలి**

**-కలెక్టర్ డా.కె.మాధవీలత**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఫిబ్రవరి 9న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టరు డా. కే. మాధవీలత సంబందిత సమన్వయ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరింలో విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు కార్యాచరణ ప్రణాళిక పై అధికారులకు కలెక్టరు పలు సూచనలు జారీచేసారు.

ఈ సందర్భంగా కలెక్టరు మాధవీలత అధికారులతో కలసి ఫిబ్రవరి 9న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టరును విడుదల చేశారు. ఈ సంధర్బంగా కలెక్టరు మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు మందుల పంపిణీకి జరగాలని సమన్వయ అధికారులను ఆదేశించారు.

ఆరోగ్య శాఖ, డిఈవో, డిఎల్ డీవోలుమండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని కలెక్టరు సూచించారు. రక్త హీనత నివారణకు నులిపురుగులు నివారణ ఆవశ్యకత ఉందని గుర్తించాలన్నారు. నులిపురుగుల వలన రక్త హీనత, పోషకాలు లోపం, ఆకలి మందగించటం, నీరసం, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. ఆల్ బెండజోల్ మాత్ర వేయడం ద్వారా రక్త హీనత నివారణ, పోషకాలు గ్రహించడం జరుగుతుందని తద్వారా ఏకాగ్రత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి అందజేయాలని, 9వ తేదిన మాత్రలు తీసుకొని పిల్లలకు 10, 11 తేదీలలో విధిగా అందించాలని ఆయన స్పష్టం చేశారు.

1 నుండి 5 సంవత్సరాల చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల లోను, 6 నుండి 19 సంవత్సరాల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలలలో పంపిణీ జరుగుతుందని వివరించారు. భోజనం అనంతరం మాత్రలు మింగించాలన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, మాత్రలు వేసిన అనంతరం ఎటువంటి అనారోగ్యం లక్షణం కనిపించిన వైద్య అధికారులను, వైద్య సిబ్బందిని సంప్రదించాలని కలెక్టరు అన్నారు. ఏ మోతాదులో..1 నుండి 2 సంవత్సరాల చిన్నారులకు "అర మాత్ర" గుండగా చేసి వేయించాలని, 2 నుండి 19 సంవత్సరాల విద్యార్థులకు "ఒక మాత్ర" బాగా నమిలి మింగేటట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎన్. తేజ్ భరత్, డిఆర్వో జి. నరశింహులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పెరవలి తహసిల్దార్ రాజరాజేశ్వరి దంపతులకు ఆత్మీయ వీడ్కోలు సన్మానం



పెరవలి, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తహసిల్దార్ గా పనిచేయుచున్న టీ రాజరాజేశ్వరి ఎన్నికల ప్రక్రియ బదిలీ లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ పై వెళ్లడంతో ఫిబ్రవరి 4వ తేదీ ఆదివారం తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది వీఆర్వోలు వీఆర్ఏలు తాసిల్దార్ టి రాజరాజేశ్వరి ను ఆయన భర్త ఉండ్రాజవరం తాసిల్దార్ గొట్టుముక్కల కనకరాజు లను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు ఈ సందర్భంగా తాసిల్దార్ రాజ రాజేశ్వరి మాట్లాడుతూ తాను పెరవలి మండలంలో తాసిల్దార్ గా పనిచేసినప్పుడు ప్రతి ఒక్కరు తనకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించారు అన్నారు తాను ప్రతి ఒక్క నాయకులు ప్రజలు సామాన్యులు అభిమానం పొందానని భావిస్తున్నానని అన్నారు పెరవలి మండలంలోని ప్రతి ఒక్కరితో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని అన్నారు విధినిర్వహణలో తనకు సహకరించిన తాసిల్దార్ కార్యాలయ సిబ్బందికి వీఆర్వోలు వీఆర్ఏలు నాయకులు ప్రతి ఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు

## గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థకు స్టార్ ఐకానిక్ 2022-23అవార్డ్స్



పి.గన్నవరం, మేజర్ న్యూస్ : ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక సహాయం చేసి ఆదుకునే గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ సేవలను గుర్తించిన విజయవాడకు చెందిన గ్రైడ్ సాఫ్ట్ ప్రజెంట్ వారు వివెన్ట్ వారి ఆధ్వర్యంలో స్టార్ ఐకానిక్ 2022-23అవార్డ్స్ అందజేయడం జరిగింది. గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థకు మరియు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కట్ట భాస్కర్‌కి సంస్థ ప్రారంభం నుంచి జరిగే సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే మరో 15 మంది సభ్యులకు ఈ అవార్డ్స్ వరించాయి. ఈ అవార్డ్స్ అందుకున్న సంస్థ సభ్యులు ఆనందం వ్యక్తపరిచారు. గతంలోనూ ఉత్తమ సేవాసంస్థగాను మరియు హైదరాబాదుకు చెందిన కొన్ని సంస్థల వారు అవార్డ్స్ అందజేసిన సందర్భాన్ని మరొకసారి గుర్తుచేసారు. ఈ సంస్థ చేస్తున్న సేవలకు ఈ అవార్డ్స్ స్వీకరించిన సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు.

## మండలంలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణి వేగవంతం

– ఇన్‌చార్జి ఎంపిడిఓ సత్యనారాయణమూర్తి



పెద్దాపురంరూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండల పరిధిలోని 23 గ్రామాల పంచాయతీ పరిధిలో ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపిడిఓ ముల్లు సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ పెద్దాపురం మండల పరిధిలో 24,720 ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయని, వాటిలో 18,694 కార్డులు సచివాలయాల ఎఎన్ఎంలు, వలంటీర్లు, ఆశాల ద్వారా పంపిణి చేయడం జరిగిందని, ఆయన తెలిపారు. మిగతా 4,718 కార్డులు త్వరలో పంపిణి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే పెద్దాపురం మండల పరిధిలోని నవరత్నాలలో భాగంగా పేదలందరికి ఇళ్ళు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సచివాలయ సెక్రటరీలకు, సిబ్బందిని ఆదేశించారు.

## సలాది చేరికతో జనసేనలో జోష్..



కొత్తపేట,మేజర్‌న్యూస్ : రాష్ట్ర కాపు రిజర్వేషన్ ఉద్యమనేత సలాది స్వామినాయుడు తనయుడు సలాది రామకృష్ణ జనసేనలో చేరికతో పార్టీ లో జోష్ వచ్చిందని కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు. ఇటీవలే జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు సమక్షంలో సలాది పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ నేపధ్యంలో ఆదివారం సాయంత్రం ఆయన స్వగృహం నందు జనసేన పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో సలాది అనుచరులు శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో భారీగా జాయిన్ అయ్యారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తపేట మండలానికి జనసేన పార్టీ తరుపున బలమైన నాయకుడు లేదన్న లోటు రామకృష్ణ చేరికతో తొలిగిపోయిందన్నారు.కొత్తపేట మండలం మరింత బలపడిందని కొనియాడారు. అలాగే సలాది మాట్లాడుతూ దారుణమైన నిర్ణయాలతో జగన్ ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తుందని ఎద్దేవా చేశారు. భూతుల పురాణం మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధి పై లేదని అన్నారు.త్వరలోనే ఈ నియోజకవర్గంలో వైసీపీ కంచుకోట బద్దలు కొట్టడం ఖాయమని అన్నారు.అన్ని సామాజిక వర్గాల నుండి జనసేన కి ఆదరణ లభిస్తుందని,పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగీత సుభాష్,మండల అధ్యక్షుడు కంఠంశెట్టి చంటి,టౌన్ అధ్యక్షుడు చోడపనీడి ఉమామహేశ్వరరావు,తులారాజు,పల్లికొండసుధీర్,వీరమహిళలుసత్య,తులసి,రమాదేవి,జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రంగవల్లి నగర్ వాసులకు వ్యక్తిగత మరుగుదొడ్లు, మౌలిక వసతులు కల్పించాలి -కర్నాకుల



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట శివారు రంగవల్లి నగర్ లో దాతలు సహకారంతో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు నేతృత్వంలో రంగవల్లి నగర్ పేదలకు బియ్యం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ రంగవల్లి నగర పేదల కష్టాలను చూసి చలించి ఒక దాత కుటుంబానికి 25 కేజీల బియ్యం చొప్పున 30 మందికి ఇచ్చారన్నారు.వారికి ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. వారి దాన గుణాన్ని కొనియాడారు. రంగవల్లి నగర్లో నిరుపేదలు సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నారని, వారి ఓట్లు వేయించుకుని వారికి మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు సవితి తల్లి ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. రంగవల్లి నగర్ మహిళలు బహిర్భూమికి వెళ్లాలంటే ఎన్ హెచ్ ఫైవ్ రోడ్డు పక్కన సిగ్గు సంపుకుని వెళ్లవలసిన పరిస్థితి దాపురించిందని వారన్నారు. అంగన్వాడి పిల్లలు సుమారు నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి చదువుకునే పరిస్థితి ఉందన్నారు. తక్షణమే జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని, ఇంటింటికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని, అంగన్వాడి స్కూలు మంజూరు చేయాలని, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ సి ఎస్ డివిజన్ నాయకులు డి సురేష్, డాన్ శీను, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ స్పందనకు 12 అర్జీలు



పెద్దాపురం, మేజర్‌న్యూస్ : సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 12 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివైఇఓ దాట్ల సుభద్ర, డిఎల్‌పిఓ ఎం.బాలామణి, ఎ.ఎస్.డబ్ల్యూ.ఓ వాణి, ఐసిడిఎస్ సిడిపిఓ జి.ఉష, మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, హౌసింగ్ ఏఇ రవిశంకర్, హెచ్‌డబ్ల్యూఓ విశాలాక్షి, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, డిటి భానుకుమార్, దయానందరాజు, నారాయణ, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ హామీ అమలు కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



– వేతనం 10వేలు చెల్లించాలని డిమాండ్

కాకినాడ, మేజర్ న్యూస్ : మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ డీఈవో ఆఫీసు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్జెడి కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, ఏపీ మధ్యాహ్న భోజనం పథక కార్మికుల సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ అధికారంలోకి రాగానే మధ్యాహ్న భోజన పథక కార్మికులకు పదివేల రూపాయలు వేతనం చెల్లిస్తానని జగన్ హామీ ఇచ్చి నేటికి ఐదేళ్లు పూర్తి కావస్తుందన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో నిత్యవసర ధరలు 400% పెరిగాయని, విద్యార్థికి ఇచ్చే మెనూ చార్జీలు గాని, కార్మికులకు ఇచ్చే వేతనాలు గానీ జగన్ ప్రభుత్వం పెంచకపోతే ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. బిల్లులు నెలల తరబడి పెండింగులు పెడుతున్నారని, దీంతో వేలాది రూపాయలు వంట కోసం చేసిన అప్పులు తీర్చలేక కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. 11 మండలాల్లో స్వచ్ఛంద సంస్థల్లో పనిచేసే ఆయమ్మలకు ప్రభుత్వం 3వేలు వేతనం ఇస్తుంటే, సంస్థలు మాత్రం 1500 మాత్రమే ఆయమ్మలకు చెల్లిస్తూ దోచుకుంటుంటే జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు అరికట్టాలని, ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతీనెల 5వ తేదీనే వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో కరకు సుబ్బలక్ష్మి, పకృతి వరలక్ష్మి, మారిశెట్టి మంగ, కడియాల లక్ష్మి, దేవుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ బ్యాంక్ వారిచే కుటుంబానికి పరిహారం చెక్కు అందజేత



సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట స్టేట్ బ్యాంక్ లో ఖాతా కలిగి వ్యక్తిగత భీమా కలిగిన వజ్రపు సురేష్ మృతి చెందడంతో పరిహార సొమ్ము రూ.10 లక్షలు ను మృతుని భార్య అయిన వజ్రపు నల్లమ్మ కు చెక్కు రూపంలో స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ టాపోదాన్ దేహురి చేతుల మీదుగా అందచేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ ఖాతాదారుడు సురేష్ బ్యాంక్ లో ఖాతా ఓపెన్ చేసే సమయంలో రూ. 500 రూపాయలు వ్యక్తిగత భీమా చెల్లించడం జరిగిందన్నారు. తదనంతరం సురేష్ మృతి చెందడంతో భీమా పరిహార చెక్కును యజమాని నల్లమ్మ కు అందిస్తున్నట్టు చెప్పారు. కాగా ప్రతీవారూ బ్యాంక్ ఖాతా ఓపెన్ చేసే సమయంలో వ్యక్తి భీమా చేయించుకోవా లన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అందించే భీమా లను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె .శ్రీనివాస్, సుధా, కిరణ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసిన వైస్ ఛైర్మన్ నెక్కంటి



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘంలో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ సోమవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈ అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. మున్సిపల్ డిఇ ఆదినారాయణ తెలుపుతూ రూ.71లక్షలతో గడపగడపకు నిధులు, ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ నిధులతో (13వ వార్డులో రూ. 5లక్షలతో) ఈ అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఏఇ కృష్ణ జీవప్రసాద్, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

**– కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశం**

**– నగరపాలక సంస్థలో డయల్ యువర్ కమిషనర్, స్పందన**

**– 39 ప్రజాసమస్యలపై అందిన వినతులు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలలో అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, వివిధ విభాగాధిపతులతో కలిసి ప్రజల నుంచి వచ్చిన వినతులను కమిషనర్ స్వీకరించారు.

డయల్ యువర్ కమిషనర్‌కు 28, స్పందనలో 11 దరఖాస్తులను అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజాసమస్యలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. పరిష్కారానికి అవకాశం లేని సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని కూడా దరఖాస్తుదారులకు తెలియజేయాలని కోరారు. ప్రతి ఒక్క దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని, ఆ దిశగా అన్ని విభాగాల అధికారులు దృష్టి పెట్టాలని కమిషనర్ ఆదేశించారు.

టిడ్కో గృహాల్లో నాలుగో అంతస్తులో కేటాయించిన ఫ్లాట్‌ను మొదటి అంతస్తులోకి మార్పు చేయాల్సిందిగా కోరుతూ ఓ దివ్యాంగుడు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, విభాగాలకు సంబంధించి వేర్వేరు అంశాలపై వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి.సత్య కుమారి, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, పలువురు డిఈలు, ఏఈలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు పందిరి రాట ఏర్పాటు

సామర్లకోట, మేజర్ న్యూస్ : మార్చి నెల 6 వ తేదీ నుండి 11 వ




తేదీ వరకూ జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి పందిరి రాటను సోమవారం ఆలయ ఆవరణలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ మల్లేశ్వర రావు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పందిరి రాట ముహూర్తంను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## నేడు టిడ్కో అపార్ట్‌మెంట్లు లబ్దిదారులకు అప్పగింత



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘ పరిధిలో స్థానిక వాలుతిమ్మాపురం వెళ్ళే రోడ్డులో నిర్మించిన టిడ్కో అపార్ట్‌మెంట్‌లను లబ్దిదారులకు మంగళవారం అప్పగించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మీలు పాల్గొననున్నారని, ఆమె తెలిపారు. అలాగే ఏ1, ఏ2, ఏ7 బ్లాక్‌లకు సంబంధించి 96మంది లబ్దిదారులకు ఈ అపార్ట్‌మెంటులను పంపిణీ చేయడం జరుగుతుందని, త్వరలోనే మిగతా అపార్ట్‌మెంటులు కూడా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సూచనల మేరకు లబ్దిదారులకు అందజేస్తామని ఆమె తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్‌తో కలసి ఆమె అపార్ట్‌మెంటులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, తదితరులు ఉన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ శేఖర్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా గుంటూరు శేఖర్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సిడిఎంఎలో అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో శేఖర్ నియమితులయ్యారు. గతంలో ఆయన 2020–2021 మధ్య పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ గా పనిచేశారు. విధుల్లో చేరిన ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు, అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## పెద్దాపురం డివిజన్‌లో స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్లు

– డిప్యూటీ డిఎం & హెచ్ఓ డా.పి.సరిత



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం డివిజన్ 11 మండలాల పరిధిలో ఉన్న స్కానింగ్ కేంద్రాలపై జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు డెకాయ్ ఆపరేషన్లు, వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని, కాకినాడ జిల్లా డిప్యూటీ డిఎం & హెచ్ఓ డా.పి.సరిత తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 33 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఆమె తెలిపారు. ఈ నెలలో 5 స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఆమె వెంట ప్రభుత్వ వైద్యులు డా.ఎల్.అనూషరాయ్, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# 12వ డివిజన్‌లో జనసేన 'మేము సిద్ధం' కార్యక్రమం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ్ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో 12 డివిజన్ సంజయనగర్ ప్రాంతంలో సాయం సాయికుమార్ మరియు దుర్గ ఆధ్వర్యంలో మన నివాసానికి ఇళ్ళు కావాలి మన కాకినాడ లోనే అని అంటూ మేము సిద్ధం అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడ్డాకా జగన్మోహన్ రెడ్డి ప్రజలమీద వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తున్నారనీ, నాకోసం మీరు రెండు సార్లు బటన్ నొక్కమని అంటున్నారనీ, కాకినాడ సిటీ ప్రజలు ఎందుకు బటన్ నొక్కాలో చెప్పమంటున్నారన్నారు. ఈప్రాంతంలో నివాసం ఉంటున్న వీరి కంటికి ఎదురుగా ఖాళీ నివేసిన స్థలాలు కనిపిస్తున్నాయనీ, కానీ వీళ్ళందరినీ తీసుకెళ్ళి కొమరిగిరిలో నివాసానికి ఇళ్ళు ఇస్తున్నారనీ వీళ్ళకి ఈ ఊరిలో ఇళ్ళు ఇవ్వాలన్న ఉద్దేశం ఈ స్థానిక ఎం.ఎల్.ఏ ద్వారంపూడికి గానీ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి గానీ లేదనీ, ఈ భూములని వేరే వాటికి వాడుకోవాలని వీరు మనసులో ఇప్పటికే ఒక నిర్ణయానికి ఒచ్చేసారని అర్థమవుతోందన్నారు. దానికి ఇబ్బంది లేకుండా తెలివిగా వీరిని తప్పిస్తూ కొమరిగిరికి తరలిస్తున్నారన్నారు. ఇక్కడి భూమి ఇక్కడి వాళ్ళకి ఇస్తే వీళ్ళందరూ సుఖంగా ఉంటారనీ తన తండ్రి ముత్తా గోపాలక్రిష్ణ తన హయాములో మూడు అంతస్తులు కడితే, చంద్రబాబు నాయుడు హయాములో నాలుగు అంతస్తులు నివాసాలను కట్టారనీ ఇపుడు కావాలంటే ఇక్కడ ఆరు అంతస్తుల నివాశ సముదాయాన్ని కట్టి ఇవ్వచ్చు టూబెడ్ రూం ఇళ్ళు కూడా ఇవ్వచ్చు అంత భూమి ఇక్కడ ఉందనీ, కానీ ఇచ్చే మనసే లేదనీ ఎద్దేవా చేశారు.



500 కోట్ల రూపాయలతో డంపింగ్ యార్డు కట్టే మన్నున్న మీకు ఇక్కడి ప్రజలపై మీకు లేకపోవడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలోనే వీళ్ళకి ఇళ్ళు ఇవ్వాలని నినందించారు. కాకినాడలోనే ఇళ్ళు పొందే విధంగా వీరందరికీ జనసేనపార్టీ హామీ ఇస్తోందని తెలియచేసారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కాకినాడలోని ప్రతి పేదవాడికీ కాకినాడలోనే ఇల్లు ఇస్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సిటి జెనరల్ సెక్రటరీ సరగడ రమణారెడ్డి, సిటి సహాయ కార్యదర్శి దూడ తాతారావు, అల్లం గోవిందరావు, దొరబాబు, సత్తిబాబు, రాయుడు దుర్గ, సరిత, విజయ, మాధవి, సుజాత, నాగదేవి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడికి వెళ్ళొద్దంటూ సర్పంచ్ రాజమణికి నోటీసు ఇచ్చిన పోలీసు వారు




**దేవిపట్నం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ పిలుపు మేరకు మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్ళొద్దంటూ పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఇందుకూరులో 1 ఏనుగుల గూడెం ఆర్.అండ్.ఆర్ కాలనీలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణికి సోమవారం పోలీసువారు నోటీస్ అందచేశారు.

## కొవ్వూరు రూరల్ ఎస్సైగా కే.సుధాకర్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కొవ్వూరు రూరల్ ఎస్సైగా కే. సుధాకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సుధాకర్ కృష్ణాజిల్లా కంకిపాడు నుండి బదిలీపై రూరల్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన జి.సతీష్ ద్వారకాతిరుమల స్టేషన్ కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రత పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు.

## కొవ్వూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పి. శ్రీనివాస్ రావు



**కొవ్వూరు,మేజర్ న్యూస్ :** కొవ్వూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పి. శ్రీనివాస్ రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసరావు విజయవాడ సిసిఎస్ నుండి బదిలీపై కొవ్వూరు విచ్చేసినట్లు తెలిపారు. ఇక్కడ సీఐగా పనిచేసిన వైవి.రమణ మచిలీపట్నం ట్రాఫిక్ సిఐగా బదిలీ అయ్యారు. సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తారని అన్నారు.

## రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పరిశీలించిన ఎడిసి నాగ నరసింహారావు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నవరత్నాలు –పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు సోమవారం సాయంత్రం పరిశీలించారు. గాంధీనగర్, ఏటిమొగ నేతాజీ పార్క్ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయో లేదో పరిశీలించారు. సాంకేతిక పరమైన ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? ఎంత సమయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తవుతోంది? వంటి అంశాలను అక్కడ ఉన్న సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడిసి నాగ నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. కాకినాడ పరిధిలోని సుమారు 29 వేల మంది లబ్దిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రభుత్వం తరఫున విఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులు రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పారు. ఆయన వెంట పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## ఎన్ఎంఆర్ కార్మికులకు రోజువారీ వేతనాలు నిర్ణయించాలి



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లా స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్ కార్మికులకు రోజువారీ వేతనాలు నిర్ణయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా కలక్టరేట్‌లో సోమవారం, జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ డా కే. మాధవీలత పేర్కొన్నారు. జిల్లా కమిటీ 2023–2024 ఆర్థిక సంవత్సరానికి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలు మరియు సంస్థల్లో పనిచేస్తున్న ఎన్ ఎమ్ ఆర్ కార్మికులకు ఈ క్రింది పేర్కొన్న విధంగా రోజువారీ వేతనాన్ని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇది 01-04-2023 నుండి 31-03-2024 వరకు అమలులో ఉంటుందన్నారు.

ఎ) నైపుణ్యం కలిగిన వారికి రోజుకు రూ.827/-
బి) సెమీ స్కిల్డ్ వారికి రూ. 687/- రోజుకు
సి) నైపుణ్యం లేని వారికి రూ. 560/- రోజుకు

ఈ సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్ బి యస్ ఎమ్ వలీ , ఎస్ఈ పీ ఆర్ మహ్మద్ ఆలిముల్లా, ఎస్ఈ ఇరిగేషన్ జి.. శ్రీనివాస రావు, ఈఈ ఆర్అండ్‌బి యస్ బివి రెడ్డిలు పాల్గొన్నారు.

## దేవీపట్నం నూతన తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పి.వి చలపతిరావు




**దేవిపట్నం, మేజర్ న్యూస్ :** ఏలూరు కలెక్టరేట్ నుండి పి.వి.చలపతి రావు బదిలీపై దేవీపట్నం తాసిల్దార్‌గా రావడం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు డిప్యూటీ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వి.ఆర్.వోలు, వి.ఆర్.ఏలు స్వాగతం పలికినవారిలో వున్నారు.

## బీజేపి తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే కారుపాటి



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** గోపాలపురం మాజీ ఎమ్మెల్యే మంత్రి కారుపాటి వివేకానంద సోమవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. సోమవారం కొవ్వూరులో రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యుడు పరిమిరాదా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కారుపాటి వివేకానంద 1983,1985, 1989లో మూడుసార్లు టిడిపి తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. సమాచార, క్రీడలు సాంస్కృతిక శాఖ మంత్రిగా సుమారు పది నెలల పాటు పనిచేశారు. గత కొన్నేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

## స్పందన కార్యక్రమానికి 53 దరఖాస్తులు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ఐటిడిఎ సమావేశం హాలులో సోమవారం వివిధ శాఖల అధికారులతో స్పందన కార్యక్రమాన్ని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఈవారం సుమారు 53 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. వై.రామవరం మండలం కానివాడ పంచాయతీకి సంబంధించి సుమారు 6 కిలోమీటర్ల సీసీ రోడ్డు పనులు వేగవంతం చేసి రోడ్డు పూర్తి చేయాలని కానివాడ పంచాయితీ సర్పంచ్ పల్లాల శిల్పారాణి, పల్లాల రాఘవమ్మ వినతి పత్రాన్ని సమర్పించారు. రంపచోడవరం మండలం చిలకమామిడి గ్రామంలో ఎక్కువ భూమి ఉందని విడో పింఛన్ ఇవ్వడం లేదని, తనకు విడో పింఛన్ మంజూరు చేయాలని చెదల బాలమ్మ దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం ఆకూరు పంచాయతీలో 6 గ్రామాలకు సంబంధించిన గిరిజనులకు జాఫ్రా పంట వేసుకునేందుకు తార్పాల్ మంజూరు చేయాలని ఆకూరు పంచాయతీ సర్పంచ్ పండ్ర సరస్వతి, కత్తుల రామకృష్ణారెడ్డి దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం మదేరు వాగు నుండి రైతుల పొలాలకు నీరు మళ్లించుటకు ఇనుప సట్టర్లు ఏర్పాటు చేసామని వాటికి రావలసిన డబ్బులు మంజూరు చేయాలని కొంగర రామయ్యదొర దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానికంగా ఉపాధి కల్పించడంలో వైకాపా విఫలం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానికంగా ఉపాధి కల్పించడంలోనూ, పేదలకు నీడ కల్పించే విషయంలో వైకాపా పార్టీ ఘోరంగా విఫలమైందని జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ్ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ విమర్శించారు. సోమవారం ముత్తా శశిధర్ నాయకత్వంలో రామకృష్ణారావుపేట ఆనంద్ భారతి సమీపంలో డాక్టర్ బాబు, జాడా రాజు ఆధ్వర్యంలో కాకినాడ సిటిలోనే ఉపాధి అదిమా హక్కు అని అంటూ మేము సిద్ధం అనే కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ స్థానికంగా ఉపాధి కల్పించడంలోనూ, పేదలకు నీడ కల్పించే విషయంలో వైకాపా పార్టీ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకోవడంలో మాట తప్పి నిలువునా మోసం చేసిన వైకాపా నాయకులు ఇంకా అధికార మదంతో కొట్టుమిట్టాడుతూ పాలన వదిలి ప్రతిపక్షాలను హేళన చేయడం దుర్మార్గం అన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, కాకినాడ నగరంలో ఎమ్మెల్యే ద్వారంపూడిని రానున్న ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపేందుకు కాకినాడ నగర ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. రాజ్యాంగపరంగా ఎన్నికలలో పోటీ చేసే అవకాశం అన్ని రాజకీయ పార్టీలకు ఉంటుందని దానిలో భాగంగానే ఏ రాజకీయ పార్టీపై పోటీ చేయాలో ఆయా పార్టీల అధ్యక్షులు చూసుకుంటారని, అవగాహన లేని మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. గడిచిన నాలుగున్నర ఏళ్ళ కాలంగా వైకాపా పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో రాష్ట్ర ప్రజలు విసుకెక్కిపోయి ఉన్నారన్నారు. వాస్తవాన్ని గ్రహించలేక అధికారం దూరమవుతుందనే బాధను జీర్ణించుకోలేక సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య, జిల్లా సమ్యుక్త కార్యదర్శి బదే క్రిష్ణ, జనసేన నాయకులు చోడిశెట్టి శ్రీమన్నారాయణ. మనోహర్ లాల్ గుప్తా, బసవాడి నాగబాబు, సత్తిబాబు, అగ్రహారం సతీష్, కాంటారవిశంకర్, దారపు సతీష్, వాసిరెడ్డి సుబ్బారావు, చీకట్ల శ్రీనివాస్, వీరమహిళలు మిరియాల హైమావతి, బోడ పాటి మరియ, బంది సుజాత, సబ్బే దీప్తి, నగీన, ఖాతూన్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్‌గా కృష్ణ జ్యోతి



రంపచోడవరం, మేజర్ న్యూస్ : రంపచోడవరం నూతన తాసిల్దారుగా ఎ.కృష్ణ జ్యోతి సోమవారం స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా నూతన తాహసిల్దార్ కృష్ణ జ్యోతి మాట్లాడుతూ ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో తహసీల్దార్‌గా కొంతకాలం పనిచేయడం జరిగిందని, చింతలపూడి మండలం నుండి రంపచోడవరం మండల తహసీల్దార్‌గా బదిలీ జరిగిందన్నారు. మండలానికి సంబంధించిన రెవిన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలకు అందుబాటులో ఉండడం జరుగుతుందని ఆమె తెలిపారు. నూతన తహసీల్దార్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ బి.రాజు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ యం.విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు యన్.చెల్లాయమ్మ, డి.ఇందిరా బాయి, సాయి, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతూ పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేయడం జరిగింది.

# జగనన్నకు చెబుదాం-స్పందనకు -378 అర్జీలు



కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమంలో అందిన సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా..జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామ చంద్రమూర్తి, ఇన్చార్జి డీఆర్వో, డీఆర్డీఏ కె.శ్రీరమణి, బీసీ కార్పొరేషన్ ఈడీ అద్దంకి శ్రీనివాసరావు, కాకినాడ డీఎల్డీవో పి.నారాయణమూర్తిలతో కలిసి జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కారించవలసిందిగా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం–378 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం– స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని సంబందిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలనన్నారు. అర్జీదారుల సమస్యలకు సంబంధించిన ఫోటోలను తప్పనిసరిగా పరిష్కార నివేదికలకు జతపరచాలని ఆమె తెలిపారు. రీ ఓపెన్ అయ్యే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం జనసేనపార్టీ అభ్యర్థిగా ఉదయ శ్రీనివాస్



గొల్లప్రోలు,మేజర్‌న్యూస్ : పిఠాపురం నియోజకవర్గం జనసేనపార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా జనసేనపార్టీ అధిష్టానం పిఠాపురం జనసేనపార్టీ ఇంచార్జ్ తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌కు పిఠాపురం జనసేనపార్టీ టికెట్ కేటాయించినట్లు ఆ పార్టీవర్గాల నుండి వినిపిస్తున్న సమాచారం. దీనిపై స్థానిక జనసేనపార్టీ టికెట్టు రేసులోఉన్న కొంత మంది నేతలు డాక్టర్ పిల్లా శ్రీధర్ లాంటి నాయకులు ముందుచూపుతో జనసేన పార్టీ అధిష్టానం ఆదేశాలను అనుసరిస్తూ ఆ పార్టీ ఇంచార్జ్ ఉదయతో పార్టీ పటిష్టకు కలిసి పనిచేస్తున్నారు. మరి కొంతమంది టిడిపి మూలాలు ఉన్న నేతలు అసంతృప్తి వ్యక్తపడుతున్నారు అని పిఠాపురం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తల నుండి వినిపిస్తున్న మాట. ఇప్పటికే యు కొత్తపల్లి పిఠాపురం రూరల్ గొల్లప్రోలు పట్టణ గ్రామీణ ప్రాంతాలలో తంగేడు ఉదయ శ్రీనివాసు జనసేన పార్టీ కార్యక్రమాలు నిర్వహించి వైసీపీ పార్టీ నిదురుకునే విధంగా పార్టీని పటిష్ట పరిచారని నియోజకవర్గప్రజలు జనసేన పార్టీ ఇంచార్జ్ తంగేళ్ల ఉదయ శ్రీనివాసును డాక్టర్ పిల్లా శ్రీధర్ల వైపుఆసక్తి కనపరుస్తున్నారు. పిఠాపురం అసెంబ్లీ పరిధిలో జనసేన వైయస్సార్ పార్టీ ఎన్నికల పోరు రసవంతంగా మారనుంది. నియోజకవర్గప్రజలకు సుపరిచితురాలుగా వైసిపి పార్టీ నుండి వంగాగీత తక్కువ టైంలోనే ప్రజలను ఆకర్షించిన ఉదయ శ్రీనివాస మధ్య ఎన్నికల సమరం ఆసక్తిని రేకెత్తిస్తుందని పిఠాపురం ప్రజలు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్నికల అనంతరం విజయం ఏ పార్టీదో వేచి చూద్దాం మరి..

# మరిడమ్మ దేవస్థానంలో వేలంపాటలో పాల్గొన్న పాటదారులు



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీ శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు సోమవారం ఉదయం 11గంటలకు దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు, దేవస్థానం ఛైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ చల్లా ఉదయ్‌బాబు ఆధ్వర్యంలో అమ్మవార్కి భక్తులచే సమర్పించబడిన గాజులు, చీరలు, రవికలు తీసుకునే మరియు అమ్ముకునే లైసెన్స్ కొరకు టెండర్ కమ్ బహిరంగ వేలం పాట (ది.1-4-2024 నుండి ది.31-3-2026 కాలపరిమితి వరకు)లో పెద్దాపురం పట్టణానికి చెందిన రెడ్డి సూరన్న రూ.22,40,000/-లకు హెచ్చు పాటదారుగా పాట కైవసం చేసుకున్నట్లు అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ్మోహనరావు తెలిపారు. అలాగే గత పాట కంటే ఈ సంవత్సరం రూ.2,05,000/- ఆదాయం అధికంగా వచ్చిందని తెలిపారు. అనంతరం తలనీలాలు ప్రోగు చేసుకునే లైసెన్స్ కొరకు పెనుమర్తి వరప్రసాద్ సంవత్సరం ఒక్కింటికి రూ.39వేలకు హెచ్చు పాట పాడి కైవసం చేసుకున్నట్లు, అలాగే గతం కంటే రూ.4వేల ఆదాయం అధికంగా వచ్చినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ రామ మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది కెవిడి ప్రసాద్, క్రాంతి, లోవ, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.

## యెంట్రుకోన గ్రామ సచివాలయంలో ఇళ్ళ పట్టాల లబ్దిదారులకు రిజిస్ట్రేషన్



అల్లవరం, మేజర్ న్యూస్ : యెంట్రుకోన గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షుతన పంచాయతీ సెక్రటరీ & సిబ్బంది మరియు విఆర్‌వో రెడ్డి, సచివాలయం సిబ్బంది సమక్షంలో సోమవారం జగనన్న కాలనీలో పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి లబ్దిదారులకు సర్వ హక్కులు కల్పించటం జరిగింది.

## పంచాయితీ కార్మికుల వేతనాలు పెంచాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** వలసపాకల గ్రామ పంచాయితీలో పంచాయితీ కార్మికులకు వేతనాలు పెంచాలని గత ఏడాది మార్చి 30వ తేదీన గ్రామ పంచాయితీ సెక్రటరీకి వినతిపత్రాన్ని అందజేయడం జరిగిందని, నిధులు లేవని, మార్చి నెలలో పెంచుతామని చెప్పారు కానీ నేటికీ పెంచలేదని ఏపీ గ్రామ పంచాయితీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మండిపడింది. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పరిశ్రమవారు మూడు కోట్ల దగ్గరగా పరిశ్రమ టాక్స్ చెల్లించారని, పిఎఫ్ దాదాపు ఆగష్టు నెల నుంచి పిఎఫ్ ఖాతాకు జమ చేయడం లేదని, సుమారు లక్ష 70 వేల వరకు బకాయి ఉందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే కార్మికులకు జీతాలు పెంచాలని, కట్ చేసిన పిఎఫ్ సొమ్మును పిఎఫ్ ఖాతాకు వెంటనే జమ చేయాలని యూనియన్ కోరింది. ఈమేరకు డిపివో జిల్లా పంచాయితీ అధికారికి వినతిపత్రాన్ని సమర్పించడం జరిగింది.